ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక
సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 2 | సంచిక: 286 | పేజీలు: 4 | వెల: రూ.3/- | గురువారం 23 జనవరి 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

## కుంభమేళాకు పోటెత్తుతున్న భక్తులు

కొన్ని చిత్రాలను విడుదల చేసిన నాసా



**లక్నో, జనవరి 22 (ప్రభాత ఉదయం):** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళాకు భక్తులు పోటెత్తుతున్నారు. 45 రోజులపాటు సాగే ఈ మహాకుంభ మేళాలో భాగంగా త్రివేణీ సంగమంలో స్నానాలు చేసేందుకు ప్రపంచం నలుమూలల నుంచి అంచనాలకు మించి తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో భక్తుల కోసం యూపీ సర్కార్ పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. భక్తుల కోసం ప్రత్యేక టెంట్లు వంటి నిర్మాణాలు చేపట్టింది. దీంతో మహాకుంభ్ మొత్తం ఓ పెద్ద నగరాన్ని తలపిస్తోంది. ఇందుకు సంబంధించి కొన్ని చిత్రాలను భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ తాజాగా విడుదల చేసింది. స్పేస్ సెంటర్ నుంచి కుంభమేళా ఏరియాను ఉపగ్రహాలు తీసిన ఫొటోలను సోషల్ మీడియాలో పోస్టు చేసింది. మహాకుంభ మేళాకు సంబంధించిన ఏర్పాట్లు చేయకముందు, చేసిన తర్వాత తీసిన ఫొటోలను షేర్ చేసింది ఇస్రో. ఆ ఫొటోల్లో గతేడాది ఏప్రిల్‌లో మహాకుంభ్ ప్రాంతం మొత్తం నిర్మానుష్యంగా కనిపించింది. ఇక డిసెంబర్ 22 నాటికి నిర్మాణాలు వెలిశాయి.

## బేటీ బచావో, బేటీ పఢావోకు పదేళ్లు

### ట్విటర్ వేదికగా భావోద్వేగానికి లోనైన ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ, జనవరి 22 (ప్రభాత ఉదయం):** ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించిన 'బేటీ బచావో, బేటీ పఢావో' కార్యక్రమం నేటితో పదేళ్లు పూర్తి చేసుకుంది. ఈ విషయాన్ని గుర్తు చేస్తూ ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం సోషల్ మీడియా వేదికగా కృతజ్ఞతలు తెలిపారు. 'నేటితో బేటీ బచావో, బేటీ పఢావో ఉద్యమానికి పదేళ్లు పూర్తవుతాయి. గత దశాబ్ద కాలంలో ఇది ఒక కీలక పరివర్తన, ప్రజల-ఆధారిత చొరవగా మారింది. అన్ని వర్గాల భాగస్వామ్యాన్ని పొందిందని' ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా పోస్ట్ చేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. లింగ అడ్డంకులు, పక్షపాతాలను అధిగమించడంపై ఈ ఉద్యమం దృష్టి సారించిందని, ఆడపిల్లలకు విద్య, అవకాశాలు ఉండేలా చూసేందుకు ఈ కార్యక్రమం మార్గం సుగమం చేసిందని ప్రధాని మోదీ అన్నారు. ఆడ పిల్లల లింగ నిష్పత్తులను సమతుల్యం చేయడం కోసం ప్రజలతోపాటు వివిధ కమ్యూనిటీ సంస్థలు చేపట్టిన ప్రయత్నాలకు, అంకిత భావానికి ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలిపారు.

# కొనసాగుతున్న తెలంగాణ పెట్టుబడుల వేట

### రూ.10 వేల కోట్ల పెట్టుబడులకు కంట్రోల్ ఎస్ సంస్థ ప్రతినిధులు సంతకాలు

### ప్రాజెక్ట్ దాదాపు 3,600 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయని అంచనా

### తెలంగాణ వృద్ధిలో ఈ డేటా సెంటర్ మరో మైలురాయి : ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు





**హైదరాబాద్, జనవరి 22 (ప్రభాత ఉదయం):** తెలంగాణ ప్రభుత్వం దావోస్‌లో పెట్టుబడుల వేట కొనసాగిస్తోంది. ఇదివరకే యూనిలీవర్, హెచ్‌సీఎల్ లాంటి దిగ్గజ కంపెనీలతో ఒప్పందాలు చేసుకుంది. తాజాగా హైదరాబాద్‌లో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు కంట్రోల్ ఎస్ ముందుకొచ్చింది. ప్రపంచ ఆర్థిక సదస్సులో భాగంగా రూ.10 వేల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో కంట్రోల్ ఎస్ సంస్థ ప్రతినిధులు సంతకాలు చేశారు. తెలంగాణలో అత్యాధునిక డేటాసెంటర్ క్లస్టర్‌ను నెలకొల్పేందుకు కంట్రోల్ ఎస్ డేటా సెంటర్స్ లిమిటెడ్ కంపెనీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు తెలంగాణ బృందంతో భేటీ అనంతరం సంతకం చేసింది. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో తెలంగాణ ప్రభుత్వంతో ఈ ఒప్పందం కుదిరింది. ఆర్టిఫిషియల్ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు ఈ కంపెనీ రూ. 10,000 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చింది. ఓవరాల్ గా 400 మెగా వాట్ల సామర్థ్యంతో ఈ డేటా సెంటర్ రూపొందనుంది. ఈ ప్రాజెక్ట్ దాదాపు 3,600 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయని తెలంగాణ ప్రతినిధులు అంచనా వేశారు. ఈ సమావేశం అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. తెలంగాణ డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో కంట్రోల్ ఎస్ వారు నెలకొల్పనున్న ఈ డేటా సెంటర్ మరో మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. ఐటీ సేవల సామర్థ్యం తెలంగాణలో

..మిగతా 2లో



## హైదరాబాద్‌లో కొత్తగా హెచ్‌సీఎల్ టెక్ సెంటర్

### 3.20 లక్షల విస్తీర్ణంలో క్యాంపస్ ఏర్పాటు

### విస్తరణకు సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానం

**హైదరాబాద్, జనవరి 22 (ప్రభాత ఉదయం):** ప్రముఖ గ్లోబల్ టెక్నాలజీ కంపెనీ హెచ్‌సీఎల్ హైదరాబాద్ లో కొత్త టెక్ సెంటర్‌ను ప్రారంభించనుంది. దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం తెలంగాణ పెవిలియన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి డి శ్రీధర్ బాబు, హెచ్‌సీఎల్ టెక్ గ్లోబల్ సీఈవో, ఎండీ సివిజయకుమార్‌తో చర్చలు జరిపారు. హెచ్‌సీఎల్ కొత్త సెంటర్‌లో లైఫ్ సైన్సెస్, ఫైనాన్షియల్ సర్వీసెస్ సేవలకు ప్రాధాన్యమిస్తుంది. అత్యాధునిక క్లౌడ్, అర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సొల్యూషన్‌లను అందిస్తుంది. హైటెక్ సిటీలో 3.20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో హెచ్‌సీఎల్ కొత్త క్యాంపస్ ఏర్పాటవుతుంది. ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ నుండి గోల్డ్ సర్టిఫికేషన్ అందుకుంది. దీంతో దాదాపు 5,000 మంది ఐటీ నిపుణులకు ఉద్యోగాలు లభిస్తాయి. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో పాటు, ఐటీలో ప్రతిభా వంతులైన నిపుణులతో ఇప్పటికే హెచ్‌సీఎల్ గ్లోబల్ నెట్‌వర్క్ సెంటర్ గా హైదరాబాద్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ కొత్త సెంటర్ మరింత అత్యాధునిక సామర్థ్యాన్ని అందుబాటులోకి తెస్తుందని హెచ్‌సీఎల్ టెక్ సీఈవో విజయకుమార్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో హెచ్‌సీఎల్ సేవల విస్తరణను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్వాగతించారు. ప్రపంచంలో ఐటీ హబ్ గా హైదరాబాద్ తన స్థానాన్ని మరోసారి పదిలం

..మిగతా 2లో

### బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలపై

## కన్నెత్తి చూసినా ఊరుకోం

### 60 లక్షలు మంది సైనికుల పార్టీ బీఆర్ఎస్ కార్యాలయాలపై దాడి చేసే దరిద్ర్యపు సంస్కృతి కాంగ్రెస్‌ది : కల్వకుంట్ల కవిత



**నల్లగొండ, జనవరి 22 (ప్రభాత ఉదయం):** బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలపై కన్నెత్తి చూసినా ఊరుకునే ప్రసక్తే లేదని బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న కల్వకుంట్ల కవిత.. 60 లక్షల మంది సైనికులు ఉన్న కుటుంబం తమ బీఆర్ఎస్ పార్టీ అని, తమ పార్టీ కార్యాలయాలపై, ఇళ్లపై దాడులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. తమ పార్టీ కార్యకర్తలు తలుచుకుంటే తెలంగాణలో కాంగ్రెస్ నాయకులు తిరిగే పరిస్థితి కూడా ఉండదని హెచ్చరించారు. ఖబర్దార్ కాంగ్రెస్ నాయకులారా.. జాగ్రత్తగా ఉండండి, ఇంకోసారి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వైపు కన్నెత్తి చూసినా పార్టీ కార్యకర్తలు ఊరుకోరు అంటూ కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. రౌడీ మూకలతో ఇతరుల పార్టీ కార్యాలయాలపై దాడి చేసే దరిద్రపు సంస్కృతి తమది కాదని చెప్పారు. మూసీ మురికిమయం కావడానికి కారకులు ఎవరో ప్రజలు ఇప్పటికైనా గుర్తించాలని కవిత

..మిగతా

## అర్హులందరికీ రేషన్ కార్డు.. ఇందిరమ్మ ఇల్లు



### దరఖాస్తు చేసుకుంటే మంజూరు ఇస్తాం

### విపక్షాల రెచ్చగొట్టే ప్రయత్నాలను నమ్మొద్దు

### కరీంనగర్ జిల్లాలో మంత్రుల హామీ

**కరీంనగర్, జనవరి 22 (ప్రభాత ఉదయం)::** అర్హులందరికీ రేషన్ కార్డులు ఇస్తామని, ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భరోసా ఇచ్చారు. పేదలందరికీ కార్డులు ఇస్తామని, ప్రతిపక్షాలు ఆరోపించినట్లు ఎవ్వరూ భయపడొద్దని మంత్రి చెప్పారు. వివిధ గ్రామసభల్లో మంత్రులు ఉత్తమ్, పొన్నం ప్రభాకర్‌లు పాల్గొని ప్రజలకు భరోసా ఇచ్చారు. ఎవ్వరూ ఆందోళన చెందవద్దన్నారు. కరీంనగర్ జిల్లా మానకొండూరు గ్రామసభలో ఉత్తమ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజాపాలన దరఖాస్తులు అన్నీ పరిశీలిస్తున్నామని చెప్పారు. ఈరోజు దరఖాస్తు ఇచ్చినా రేషన్ కార్డు ఇస్తామని మంత్రి చెప్పుకొచ్చారు. పదేళ్లపాటు రేషన్ కార్డులు ఇవ్వకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలను మోసం చేసిందని ఆయన మండిపడ్డారు. కాగా, తెలంగాణ వ్యాప్తంగా జనవరి 21 నుంచి గ్రామసభలు ప్రారంభమయ్యాయి. గ్రామసభల్లో కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజలు భారీగా దరఖాస్తులు చేసుకుంటున్నారు. ఈనెల 24 వరకూ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించడంతో పెద్దఎత్తున దరఖాస్తులు వస్తున్నాయి. కాగా, ఈనెల 26న నుంచి అర్హులకు రేషన్ కార్డులను కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేయనుంది. గతేడాది డిసెంబర్‌లో తెలంగాణ ప్రభుత్వం కులగణన సర్వే చేసింది. ఈ సర్వేలో చాలామంది తమకు రేషన్ కార్డులు లేవని ఎన్యూమరేటర్ల కు తెలిపారు. ఈ విషయాన్ని ఎన్యూమరేటర్లు పైఅధికారులకు చెప్పారు. అయితే తొలుత అంతా కులగణన సర్వే ఆధారంగా కొత్త రేషన్ కార్డులు ఇస్తారని భావించారు. కానీ గ్రామసభలు పెట్టి నూతన కార్డులు ఇస్తామని మంత్రులు ప్రకటించారు. ఈ మేరకు దరఖాస్తులు వెల్లువలా వస్తున్నాయి. ఈ క్రమంలో అర్హత ఉన్న చివరి వ్యక్తి వరకు రేషన్ కార్డులు ఇస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం కరీంనగర్ జిల్లాలోని నారాయణపూర్‌లో నిర్వహించిన గ్రామ సభ కార్యక్రమంలో మంత్రి ఉత్తమ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని స్పష్టం చేశారు. గత పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో నలభై వేల మందికి మాత్రమే రేషన్ కార్డులు ఇచ్చారని.. కానీ మేం అర్హులందరికి రేషన్ కార్డులు ఇస్తామన్నారు.నలభై లక్షల రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పులు చేయనున్నట్లు పేర్కొన్నారు. రేషన్ కార్డుల

..మిగతా 2లో



## రాష్ట్రంలో ప్రజాప్రతినిధులకే రక్షణ లేదు

### సోయిలేని కాంగ్రెస్ పాలన

### దాడి చేసిన వారిపై కాకుండా బాధితులపై కేసులా

### ఎక్స్ వేదికగా కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ విమర్శలు

**హైదరాబాద్, జనవరి 22 (ప్రభాత ఉదయం):** రాష్ట్రంలో ప్రజా ప్రతినిధులకు కూడా రక్షణ లేకుండాపోతుందని, కాంగ్రెస్ గూండాలు హద్దులు దాటుతున్నారని మాజీ మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో దివ్యాంగుడైన ఒక మాజీ ఎమ్మెల్యేకే రక్షణ లేదని.. కోమటిరెడ్డి వెంకటరెడ్డి దుండగులు దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా విమర్శలు చేశారు. బీఆర్ఎస్‌కు భయపడి నల్గొండ రైతు మహాధర్నాకు అనుమతి ఇవ్వలేదని.. ఫ్లెక్సీలు చింపి, ఏకంగా ఓ ప్రభుత్వ ఆఫీసులో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గూండాలు దివ్యాంగుడైన మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని బూతులు తిడుతూ పోలీసుల ముందే దాడికి పాల్పడ్డారని మండిపడ్డారు. దాడి చేసింది మంత్రి గూండాలు అయితే.. పోలీసులు భూపాల్ రెడ్డిని అరెస్ట్ చేసి నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారని ఫైర్

..మిగతా 2లో




## స్వీయ రక్షణతో పాటు కుటుంబం క్షేమం కోసం ప్రతి ఒక్క వాహనదారుడు హెల్మెట్ ధరించాలి

**రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత,ట్రాఫిక్ నియమాలు పాటించాలి**

**జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు**

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి22(ప్రభాత ఉదయం):ప్రతి ద్విచక్ర వాహనదారుడు తన స్వీయ రక్షణతో పాటు తన కుటుంబ క్షేమం కోసం హెల్మెట్ తప్పక ధరించాలని, ప్రతి ఒక్కరు ట్రాఫిక్-రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ ప్రమాదాల నివారకు కృషి చేయాలని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు విద్యార్థులకు పిలుపునిచ్చారు. జాతీయ రోడ్డు భద్రతా మహోత్సవాలను పురస్కరించుకొని బుధవారం జిల్లా ఆర్టీఏ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కృష్ణ వేణి చౌక్ వద్ద విద్యార్థులతో ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలిని జిల్లా ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. కృష్ణ వేణి చౌక్ లో ప్రారంభమైన ర్యాలీ న్యూ బస్ స్టాండ్, సుంకులమ్మ మెట్టు, ఓల్డ్ బస్టాండ్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... వాహనదారులు చేసే చిన్న చిన్న తప్పిదాల కారణంగా జరిగే రోడ్డు ప్రమాదాల వల్ల వాహనదారులు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోందని, ముఖ్యంగా ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం తనవంతు బాధ్యతగా గుర్తించాల్సిన అవసరం వుందని, విద్యార్థులు రోడ్డు భద్రత గురించి కుటుంబ సభ్యులకు, బందువులకు తెలియజేయాలని , హెల్మెట్ లేకుండా బైక్ పై కుటుంబ సభ్యులు బయటకు వెళ్లకుండా చూడాలని అన్నారు. పరిమితికి మించి ఎక్కువ సంఖ్యలో ఆటోలలో వెళ్లరాదని, అతివేగం, అజాగ్రత్త తో ప్రమాదాలను కొని తెచ్చుకోవద్దని అన్నారు. ట్రాఫిక్ నియమాలను అతిక్రమించి యువత వాహనాలను నడపడం ఒక హీరోయిజంగా భవించవద్దని, అలసత్వం వలన జరిగే రోడ్డు ప్రమాదాల కారణంగా కుటుంబాలు వీధిన పడుతున్నాయని, వాహనదారుడు క్రమశిక్షణతో వాహనలు నడపడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించుకోవచ్చని, ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడపాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో అధికంగా తలకు గాయం కావడం వలన ద్విచక్ర వాహనదారులు మరణించడం జరుగుతోందన్నారు. ప్రతి ద్విచక్రవాహనదారుడు హెల్మెట్ తప్పని సరిగా ధరించి వాహనం నడపాలని, విద్యార్థులు ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ ఇట్టి విషయాలను స్నేహితులకు, బంధువులకు తెలియజేయాలని కోరారు. ఈ ర్యాలీలో గద్వాల డి.ఎస్పీ వై.మోగిలయ్య, గద్వాల్ సిఐ టి.శ్రీను, ఆర్టీఓ కృష్ణా రెడ్డి, ఎంవిఐ రాములు, ఎఓ రమేష్ కుమార్, గద్వాల్ టౌన్, రూరల్ ఎస్సై లు కళ్యాణ్ రావు, శ్రీకాంత్, ట్రాపిక్ ఎస్సై బాల చందర్, ట్రాపిక్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



బడి మానేసిన పిల్లల వివరాలను సేకరిస్తున్న సిబ్బంది

## జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు ఆదేశాల మేరకు జిల్లా లో మమ్మురంగ సాగుతున్న ఆపరేషన్ స్మైల్ బృందం -XI తనిఖీలు

**బడి మానేసిన 20 మంది చిన్నారులను డోర్ టు డోర్ కౌన్సిలింగ్ చేసి**

**తిరిగి బడికి వెళ్ళేటట్లు చేసిన ఆపరేషన్ స్మైల్ బృందం -XI**

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి22(ప్రభాత ఉదయం):జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు ఆదేశాల మేరకు జిల్లాలో ఆపరేషన్ స్మైల్ బృందం- XI జిల్లాలో మమ్మురంగా తనిఖీలు చేపడుతుంది. ఇందులో భాగంగా షాప్స్, హెూటల్స్, ఇతర ప్రదేశాల్లో బాలకార్మికులు ఉన్నా చిన్నారులను గుర్తించడం తో పాటు డ్రాప్ ఔట్ అయిన వారిని గుర్తించి వారి తల్లిదండ్రులకు డోర్ టు డోర్ కౌన్సిలింగ్ చేయ్యాలని సూచించారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఇచ్చిన ఆదేశాల మేరకు జిల్లా లేబర్ అధికారి వేణుగోపాల్, ఇంచార్జి ఎస్సై కేశవరావు ఆద్వర్యంలో చైల్డ్ లైన్ డిపార్ట్మెంట్ అధికారులు, సిబ్బంది బుధవారం మల్దకల్ మండలము లోని బిజ్వారం గ్రామంలో 10 వ తరగతి డ్రాప్ అయిన 21 మంది చిన్నారులను గుర్తించి గ్రామం లోని వారి ఇండ్లకు వెళ్లి మూడు రోజుల పాటు డోర్ టు డోర్ కౌన్సిలింగ్ చేశారు. బడి మానేసిన 20 మంది చిన్నారులను స్కూలు లో రి-జాయినింగ్ చేయించారు. ఈ సంధర్భంగా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ....బాల్యం ఎంతో విలువైనదనీ ,ఈ వయసులో పిల్లలని చదువుకోనివ్వాలని ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు మెరుగైన విద్య అందిస్తున్నారని ప్రజలు పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వారిని బడిలో చేర్పించాలని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా బాలకార్మికులు కనబడితే వెంటనే డయల్100 కాల్ చేసి పోలీసువారికి సమాచారం ఇవ్వగలరని జిల్లా ఎస్పీ సూచించారు.



## అర్హులందరికీ సంక్షేమ పథకాలు

**16వ వార్డు కౌన్సిలర్ సింగిరెడ్డి అనితా శ్రీనివాస్‌రెడ్డి**

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి22(ప్రభాత ఉదయం): కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త ఆహార భద్రత కార్డులు (రేషన్ కార్డులు), ఇందిరమ్మ ఇళ్ళు 4 పథకాలు అమలులో భాగంగా లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సర్వేలో భాగంగా బుధవారం గద్వాల మున్సిపాలిటీ లోని 16వ వార్డులో శ్రీభీమలింగేశ్వర స్వామి ఆలయం వద్ద నిర్వహించిన వార్డు సభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా 16వ వార్డు కౌన్సిలర్ సింగిరెడ్డి అనితా శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని అధికారులతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ అనితా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాల పరిశీలన అనంతరం, అర్హుల జాబితాలో ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రాధాన్యతా క్రమంలో నిరుపేదలకు ఫలాలు అందించడం జరుగుతుందని తెలిపారు. జాబితాలో వివరాలు లేని వారు దరఖాస్తు చేసుకోవచ్చునని, రేషన్ కార్డుల జారీలో నిబంధనలు పాటిస్తూ అర్హుల వివరాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటారని తెలపారు. రేషన్ కార్డుల దరఖాస్తు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు. జాబితాలో ఉన్న పేర్లలో ఏమైనా అభ్యంతరాలున్నా, జాబితాలో పేర్లు రాని అర్హులైన వారు వార్డులలో ఉన్నా మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న తెలంగాణ పెట్టుబడుల వేట

మొదటి పేజీ తరువాయి...

పెరుగుఉందని, నగరంలో ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని అన్నారు. డేటా సెంటర్ల ఏర్పాటుతో తెలంగాణ ఐటీ సేవలలో మరింత వృద్ధి సాధిస్తాయని కంట్రోల్ ఎస్ సీఈవో శ్రీధర్ పిన్నపురెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి సాంకేతిక అభివృద్ధిలో భాగస్వామ్యం పంచుకోవటంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందం చేసుకోవడంపై గర్వంగా ఉందన్నారు. యూనిలీవర్ తెలంగాణలో పెట్టుబడులకు ప్రభుత్వంతో చర్చలు జరిపింది. వినియోగ వస్తువుల తయారీలో యూనిలీవర్‌కు మంచి పేరుంది. కామారెడ్డిలో పామాయిల్ తయారీ యూనిట్ ఏర్పాటుతో పాట్లు బాటిల్ క్యాప్‌ల తయారీ యూనిట్‌ను నెలకొల్పేందుకు యూనిలీవర్ సంసిద్ధత వ్యక్తం చేసింది. ఆపై టెక్ దిగ్గజం హెచ్‌సీఎల్ సైతం హైదరాబాద్‌లో పెట్టుబడులకు ముందుకొచ్చింది. 3.2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో పెద్ద డేటా సెంటర్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. ఈ సెంటర్ ఏర్పాటుతో 5000 మందికి ఉద్యోగాలు వస్తాయని సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

## హైదరాబాద్‌లో కొత్తగా హెచ్‌సీఎల్ టెక్ సెంటర్

మొదటి పేజీ తరువాయి...

చేసుకుందని అభిప్రాయపడ్డారు. వచ్చే నెలలో కొత్త సెంటర్‌ను ప్రారంభించాలని ఆహ్వానించారు. స్థానిక యువతకు ఉద్యోగాలతో పాటు హైదరాబాద్‌లోని టెక్నాలజీ, ఇన్నోవేషన్ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఐటీ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ద్వితీయ శ్రేణి, తృతీయ శ్రేణి నగరాలకు ఐటీ పరిశ్రమను విస్తరించాలని హెచ్‌సీఎల్ టెక్ ప్రతినిధులను కోరారు. ప్రభుత్వం తరపున తగిన సహకారం అందిస్తామని చెప్పారు. 2007 నుంచే హెచ్?సీఎల్ హైదరాబాద్ నుంచి ప్రపంచ వ్యాప్తంగా తమ క్లయింట్లకు సేవలను అందిస్తోంది. కొత్త కేంద్రంతో హైదరాబాద్ లో హెచ్‌సీఎల్ మొత్తం అయిదు సెంటర్లను విస్తరించనుంది.

### బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలపై
## కన్నెత్తి చూసినా ఊరుకోం

మొదటి పేజీ తరువాయి...

చెప్పారు. రాష్ట్రాన్ని 60ఏళ్లు పాలించిన పారిశ్రామిక వ్యర్థాలు మూసీలో కలుస్తుంటే కాంగ్రెస్ ఏం చేసిందని ప్రశ్నించారు. హైదరాబాద్ కు దగ్గర్లో ఉన్న కొండపోచమ్మ సాగర్ ను వదిలేసి దూరంగా ఉన్న మల్లన్న సాగర్ నుంచి మూసీ - గోదావరి అనుసంధానం చేస్తామని ప్రభుత్వం అనడం సరికాదన్నారు. మూసీని కాంగ్రెస్ నాయకులు ఏటీఎంగా మార్చుకోవాలని చూస్తున్నారని కవిత ఆరోపించారు. కాంట్రాక్టర్ల కోసమే ప్రభుత్వం ఈ ప్రాజెక్టును చేపడుతోందన్నారు. అందులో భాగంగానే అనుసంధాన ప్రాజెక్టు వ్యయాన్ని రూ.7,500 కోట్లకు పెంచారని, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపణలు చేశారు. కొండపోచమ్మ నుంచి మూసీ అనుసంధానం చేసే ఆస్కారం ఉన్నప్పటికీ ఈ కొత్త ప్రాజెక్టు ఎందుకని అడిగారు. ఈ విషయంపై నల్లగొండ జిల్లాకు చెందిన ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మూసీలో మురుగునీటి శుద్ధి కోసం 31 ఎస్టీపీలను కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్న కవిత.. మూసీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు అప్పట్లోనే ప్రణాళికలు రూపొందించారని గుర్తు చేసుకున్నారు. మూసీ ప్రక్షాళన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలపైకి ఇళ్లపైకి బుల్డోజర్లను పంపి, కూల్చివేస్తోందని కవిత ఆరోపించారు. మూసీ ప్రక్షాళనకు అయ్యే వ్యయాన్ని మొదట్లో రూ.50 వేల కోట్లు అని, ఆ తర్వాత రూ. 1లక్ష కోట్లు, మరోసారి లక్షన్నర కోట్లు అని సీఎం చెబుతూ.. మూసీని ఏటీఎంగా మార్చుకొని ఆ డబ్బును ఢిల్లీకి పంపించే ప్రణాళిక చేస్తున్నారని చెప్పారు. మరోపక్క యాదాద్రిలో కేసీఆర్ మొదలుపెట్టిన పనులను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలన్న కవిత.. యాదాద్రి వైభవాన్ని ప్రభుత్వం కాపాడాలని కోరారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా అభివృద్ధికి కేసీఆర్ ఎంతగానో కృషి చేశారని, అందులో భాగంగానే మిషన్ భగీరథ పథకం కింద ఇంటింటికి తాగునీరు సరఫరా చేశారని చెప్పారు. ఫ్లోరైడ్ ని నిర్మూలించిన ఘనత కేసీఆర్ దేనని, ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ ఒక్క వాటర్ ప్లాంట్ పెట్టిన పాపాన కూడా పోలేదని ఆరోపించారు.

## అర్హులందరికీ రేషన్ కార్డు.. ఇందిరమ్మ ఇల్లు

మొదటి పేజీ తరువాయి...



ద్వారా ఆరు కిలోల సన్నబియ్యం ఉచితంగా ఇవ్వబోతున్నామని రాష్ట్ర ప్రజలకు మంత్రి చెప్పారు. అలాగే అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని చెప్పారు. వ్యవసాయయోగ్యమైన భూములకి ఏడాదికి రూ.12 వేలు.. భూమిలేని రైతు కూలిలకి కూడా ఏడాదికి పన్నెండు వేలు ఇవ్వబోతున్నామని తెలిపారు. పెండింగ్‌లో నారాయణ పూర్ రిజర్వాయర్ పూర్తిచేసి తీరుతామని హామీ ఇచ్చారు. నారాయణపూర్ రిజర్వాయర్ నిర్మాణానికి కావాలసిన నిధులు వెంటనే విడుదల చేస్తామని చెప్పారు. ప్రాజెక్టు ద్వారా ఇబ్బందులు పడే ముంపు గ్రామాల సమస్యలు పరిష్కరించి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగునీరు అందించాలనేది మా ప్రభుత్వ పాలసీ అని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం లక్షల కోట్లు ఖర్చు చేసి తక్కువ ఆయకట్టుకు నీరు ఇచ్చిందని దుయ్యబట్టారు. ఈ క్రమంలో రేషన్ కార్డుల జారీపై మంత్రి పొన్నం ప్రభాకర్ క్లారిటీ ఇచ్చారు. నారాయణపూర్ గ్రామంలో జరిగిన ప్రజాపాలన గ్రామ సభలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ళు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నాలుగు పథకాలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయబోతున్న నేపథ్యంలో రకరకాలుగా కొందరు మాట్లాడుతున్నారు.. ఈ సందర్భంగా జాబితాలో మీ పేర్లు లేవని కొందరు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తారు.. ఎవరు ఎన్ని చెప్పినా నమ్మకండని సూచించారు. ఎవ్వరు ఆందోళన చెందవద్దని.. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ళు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందిస్తామని స్పష్టం చేశారు. రేషన్ కార్డుల జారీ నిరంతర పక్రియ అని.. ఈ సారి లిస్టులో పేర్లు రాని వారు మళ్లీ గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకోవచ్చని క్లారిటీ ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు జారీ చేస్తామని మరోసారి బలంగా చెప్పారు.

## బాలానగర్ డివిజన్ ముదిరాజ్ సభ విజయవంతం

**నూతన కమిటీ నియామక పత్రాలను అందజేసిన గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు సురేందర్ ముదిరాజ్**




కూకట్‌పల్లి,జనవరి 22 (ప్రభాత ఉదయం): తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, కాసాని వీరేశ్ ఆదేశాల మేరకు గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు సురేందర్ ముదిరాజ్ బాలానగర్ డివిజన్ ముదిరాజ్ నూతన కమిటీకి నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు మేకల శారద, హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు బి.మాలతి, నాంపల్లి అధ్యక్షులు ఆర్. సాయిలు, కూకట్ పల్లి నియోజకవర్గ ఇంచార్జి బండి రమేష్, బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ రవీందర్ రెడ్డి, కూకట్ పల్లి నియోజకవర్గ ముదిరాజ్ సంఘం ఇంచార్జి అంబటి శ్రీనివాస్, ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి, చిలుకూరు హరిచందు, పంజా రాంచందర్, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ లక్ష్మయ్య, మహంకాళి శివశంకర్, కుక్కల రమేష్, కుక్కల రాజు పటేల్, ఎడ్ల మోహన్ రెడ్డి, నూతన ముదిరాజ్ కమిటీ సభ్యులు భారీ సంఖ్యలో ముదిరాజ్ కులస్థులు, యువకులు పాల్గొన్నారు.

## ఏడు పాయింట్లతో ఆప్ మేనిఫెస్టో

**బీజేపీని ఇరుకున పెట్టేందుకు ప్లాన్**

**న్యూఢిల్లీ, జనవరి 22 (ప్రభాత ఉదయం):** ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆయా పార్టీలు ఓటర్లను ఆకట్టుకునే పనిలో పడుతున్నాయి. ఈసారి అధికార ఆప్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య గట్టి పోటీ నెలకొంటోంది. పేద, మధ్య తరగతి ప్రజలను తమ వైపునకు తిప్పుకునేలా ఆయా రాజకీయ పార్టీలు ఎన్నికల హామీలను గుప్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్ అర్వింద్ కేజ్రీవాల్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను రిలీజ్ చేశారు. మధ్య తరగతి ప్రజలను ఆకట్టుకునే ఏడు అంశాలను ఈ మేనిఫెస్టోలో పెంచుపర్చారు. ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టే కేంద్ర వార్షిక బడ్జెట్‌లో మధ్య తరగతి ప్రజలకు మేలు చేసేలా ఉండాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లతో బీజేపీని ఆప్ కేంద్ర ప్రభుత్వం ముందుంచిన ఏడు డిమాండ్లు ఇవే..కేంద్ర బడ్జెట్‌లో ఎడ్యుకేషన్ కేటాయింపులను 2 శాతం నుంచి 10 శాతానికి పెంచాలి. ప్రైవేట్ స్కూల్ ఫీజులపై ప్రభుత్వ నియంత్రణలో ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఉన్నత విద్య చదివే వారికి సబ్సిడీలు, స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలి. హెల్త్ బడ్జెట్‌ను 10 శాతానికి పెంచాలి. అలాగే ఆరోగ్య బీమా ప్రీమియం చెల్లింపులపై పన్ను రద్దు చేయాలి. ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని ప్రస్తుత రూ.7 లక్షల నుంచి 10 లక్షలకు పెంచాలి. నిత్యావసర సరకులపై జీఎస్టీని ఎత్తివేయాలి. సీనియర్ సిటిజన్లకు బలమైన రిటైర్మెంట్ ప్లాన్, పెన్షన్ స్కీమ్స్ తీసుకురాలి. దేశ వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో సీనియర్ సిటిజన్లకు ఉచిత వైద్య సదుపాయాన్ని కల్పించాలి. దేశ వ్యాప్తంగా రైలు ప్రయాణ



టికెట్లలో సీనియర్ సిటిజన్లకు 50 శాతం రాయితీ కల్పించాలి. పన్నుల ద్వారా వచ్చే సొమ్మును విద్యతో పాటు ద్రవ్యోల్బణం నుంచి మధ్యతరగతి వారిని కాపాడేందుకు తాము వినియోగిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ ఛార్జీలు, నీటి ఛార్జీలను తగ్గించడంతో పాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో వసతులను పెంచినట్లు గుర్తుచేశారు. ఆమ్ మేనిఫెస్టో విడుదల కార్యక్రమంలో ఢిల్లీ సీఎం అతిషి సైతం పాల్గొన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఢిల్లీలో బీజేపీ నేతలు రౌడీయిజం చేస్తున్నారంటూ అతిషి ఫైర్ అయ్యారు. ఇదిలా ఉండగా ఢిల్లీలోని 70 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో ఫిబ్రవరి 5న పోలింగ్ నిర్వహించనున్నారు. 70 స్థానాల్లో మొత్తం 699 మంది అభ్యర్థులు బరిలో నిలుస్తున్నారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈ సారి అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలుస్తున్న అభ్యర్థుల సంఖ్య పెరిగింది. అర్వింద్ కేజ్రీవాల్ పోటీ చేస్తున్న న్యూఢిల్లీ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మొత్తం 23 మంది అభ్యర్థులు బరిలో నిలుస్తున్నారు.



## ఈ నెల 24న హౌసింగ్ బోర్డ్ స్థలాల వేలం పాట పారదర్శకంగా లేకపోతే అడ్డుకుంటాం

**జనసేన నాయకుడు ముమ్మారెడ్డి ప్రేమ కుమార్**

కూకట్‌పల్లి,జనవరి 22 (ప్రభాత ఉదయం):: కూకట్ పల్లి నియోజకవర్గం పరిధిలోని హౌసింగ్ బోర్డ్ అధికారులు బడులు, గుడులు, క్రీడలు, హాస్పిటల్, పాఠశాల స్థలాలు వేలంపాటలో విక్రయిస్తామంటే అడ్డుకోక తప్పదని, హౌసింగ్ బోర్డ్ అధికారులు 10 శాతం స్థలాలను పారదర్శకంగా ప్రజలకు చూపించి అప్పగించాల్సిందేనని కూకట్ పల్లి జనసేన నాయకుడు ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఫేజ్ లో సంబంధించిన లేఅవుట్ ను డిస్ ప్లే లో పెట్టాలని, వేలం పాటలో స్థలాలను పాడుకునే వారికి హెచ్చరిక - పారదర్శకంగా లేని స్థలాలు వేలం పాటలో కొనుగోలు చేసినా ఒక ఇటుక కూడా పెట్టనీయమని ఇది గమనించాల్సిన విషయమ న్నారు. హౌసింగ్ బోర్డ్ అధికారులు నియమ నిబంధనలు పాటించకుండా స్థలాలను విక్రయిస్తుంటే ప్రజల తరపున పోరాడడానికి, వేలం పాటను అడ్డుకోవడానికి సిద్ధంగా ఉండాలని కూకట్ పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ జన శ్రేణులకు సూచించారు.

## రాష్ట్రంలో ప్రజాప్రతినిధులకే రక్షణ లేదు

మొదటి పేజీ తరువాయి...

అయ్యారు. ప్రశ్నించిన తమ నేతను అరెస్ట్ చేసి.. దాడి చేసిన వారిమీద ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఇదీ కాంగ్రెస్ అరాచక పాలన తీరని మండిపడ్డారు. తమ నాయకుడు కంచర్ల భూపాల్ రెడ్డి మీద జరిగిన పాశవిక దాడిని ఖండిస్తున్నానన్నారు. బాధ్యులపై కేసులు నమోదు చేయాలని రాష్ట్ర డీజీపీని కోరుతున్నానని కేటీఆర్ ఎక్స్‌లో పేర్కొన్నారు ఇదిలాఉండగా.. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేటీఆర్ తలసాని శ్రీనివాసరావు ఇంట్లో సమావేశమయ్యారు. నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై చర్చించారు. కేటీఆర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో కంచెలు వేసి కాపాడిన ప్రభుత్వ పార్కులకు కాంగ్రెస్ పాలనలో రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డికి పాలన చేతకాదనే నిజాన్నిహైదరాబాద్ ప్రజలు అర్థం చేసుకున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ హయాంలో నిర్మించిన కట్టడాలు, నిర్మాణాల నిర్వహణ కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకావడం లేదన్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ కాపాడాలని ఈ ప్రభుత్వానికి సోయి లేకపోవడం దురదృష్టకరమని అన్నారు.

# పల్లవి స్కూల్‌లో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు





పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, తదితరులు





సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న చిన్నారులు

బుద్వేల్, జనవరి 22(ప్రభాత ఉదయం): అత్తాపూర్‌లోని పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ 2024-25 వార్షిక దినోత్సవాన్ని బుదవారం ఎంతో ఉత్సాహంగా, ఘనంగా జరుపుకుంది. 'సినీమ్యాజిక్- ఎ జర్నీ త్రూ టైమ్' అనే థీమ్ తో ఈ కార్యక్రమం జరిగింది. విద్యార్థులు యుగయుగాల బాలీవుడ్ నృత్యాల మాయాజాలాన్ని తిరిగి సృష్టించిన సినిమా అనుభూతిని అందించేలా కార్యక్రమాన్ని రూపొందించారు. ప్రతి దశాబ్దంలోని ప్రముఖ చలనచిత్రాల నుంచి తీసిన స్నిప్పెట్‌లను విద్యార్థులు సులభంగా అమలు చేయడం ఈ కార్యక్రమ ముఖ్యాంశం. విద్యార్థులు వారి ద్రవ కదలికలతో, అన్ని దరువులకు నృత్యం చేస్తూ, ప్రేక్షకులను బిగ్గరగా ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బీజేపీ నాయకులు తోకల శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. గౌరవ అతిథిగా ప్రముఖ విద్యావేత్త, పర్యావరణవేత్త ప్రొ.కె.పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయురాలు అన్నపూర్ణ కోదూరు అందించిన పాఠశాల వార్షిక నివేదికలో క్రీడలు, పాఠ్యాంశాలు, పాఠ్యాంశాల పోటీలలో విద్యార్థులు సాధించిన వివిధ విజయాలు వంటివి ఉన్నాయి. సినీమ్యాజిక్ థీమ్‌కు జీవం పోయడంలో అహర్నిశలు కృషి చేసిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బందిని ప్రిన్సిపాల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ నారాయణ మూర్తితో పాటు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. పిల్లల సమగ్ర అభివృద్ధికి పాఠశాల చేసిన ప్రయత్నాలను వారు అభినందించారు. ముఖ్య అతిథి తోకల శ్రీనివాస్ రెడ్డి ప్రేక్షకులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, పిల్లలలో సమగ్ర అభివృద్ధి ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు,. ఇది తల్లిదండ్రులు, పాఠశాల ఇద్దరి మద్దతు లేకుండా సాధ్యం కాదని, దేశ భవిష్యత్తును రూపొందించడంలో ఇద్దరూ ముఖ్యమైన పాత్ర పోషిస్తారన్నారు. అలాగే కార్యక్రమానికి విచ్చేసిన అతిథులు జాతీయ క్రీడల్లో రాణించిన విద్యార్థులకు అవార్డుకు ప్రదానం చేశారు.



వ్యవసాయ విశ్విద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య ను కలిసిన వర్సిటీ టైం స్కేల్, కాట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగ సంఘం నాయకులు

## టైంస్కేల్, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు రావాల్సిన హక్కులను కల్పించాలి

బుద్వేల్, జనవరి22(ప్రభాత ఉదయం): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్నటువంటి టైంస్కేల్, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలంటు బుధవారం తెలంగాణ యూనివర్శిటీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు, సీఐటీయు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జే.వెంకటేశ్. ఉపాధ్యక్షురాలు ఎం.పద్మశ్రీ లు కోరారు. ఈ మేరకు వారు బుధవారం వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్యను కలసి వినతి పత్రం అందజేశారు. టైం స్కేల్ ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. సీనియారిటీ, విద్యార్హత, అను బభవాన్ని పరిగణలోకి తీసుకుని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను కూడా దశలవారిగా టైం స్కేల్ పరిధిలోకి తీసుకురావాలన్నారు. టైం స్కేల్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల వయోపరిమితిని 61 సం వత్సరాలకు పెంచాలన్నారు. గ్రాట్యూటీగా రూ20 లక్షలు ఇవ్వాలన్నారు. రూ.10లక్షల ప్రమాద భీమా, రూ.10లక్షలు ఆరోగ్య భీమా సౌకర్యాన్ని కల్పించాలన్నారు. సర్వీస్ లో ఉన్న టైంస్కేల్ ఉద్యోగి ఏ కారణం చేతనైన మరణించినట్లయితే కుటుంబ వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. టైం స్కేల్ ఉద్యోగులకు వార్షిక ఇంక్రిమెంట్లు ఇవ్వాలన్నారు. శాశ్వత ఉద్యోగులకు వర్తింప చేసే లీవ్ సౌకర్యాలైన ఆర్జిత సెలవులు, సిక్ లీవ్లు, అప్షనల్ సెలవులు ఇవ్వాలన్నారు. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులను సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. రెండవ పీఆర్సీలో పర్మినెంట్ ఉద్యోగుల బేసిక్ పేని టైంస్కేల్ ఉద్యోగులకు కన్సాలిడేటెడ్ పేగా నిర్ణయించాలన్నారు. పర్మినెంట్ ఉద్యోగులకు అమలైన తేదీ నుంచే టైం స్కేల్. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూడా అన్ని పథకాలు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు జె.రుద్రకుమార్, తెలంగాణ యూనివర్శిటీ వర్కర్స్ యూనియన్ నాయకులు మహమ్మద్, మెట్టు రవి, అమీర్, మహేందర్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



అవార్డు తీసుకుంటున్న వేము వందనం

## వేము వందనంకు జాతీయ పురస్కారం

బుద్వేల్, జనవరి22 (ప్రభాత ఉదయం):: రాజేంద్రనగర్ సర్కిల్ బవానీ కాలనీ నివాసి, సాహితీవేత్త వేము వందనం కు విజయవాడ కు చెందిన శ్రీశ్రీ కళావేధిక తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారాన్ని అందచేసింది. ఈ సందర్భంగా వేము వందనం మాట్లాడుతూ, రచయితగా, నటుడిగా, దర్శకునిగా తాను చేసిన సేవలను గుర్తించిన వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పోయిట్రీ అకాడమీ,. తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్, శ్రీశ్రీ కళావేదిక తెలుగు కీర్తి తనకు జాతీయ ప్రతిభా పురస్కారాన్ని ఇవ్వడం సంతోషంగా ఉం దన్నారు. ఈ పురస్కారం తనకు 90వ పురస్కారమని వేము వందనం తెలిపారు. కళావేదిక సీఈఓ కె.ఎం ప్రతాప్ కుమార్, చైర్పర్సన్ బి.హైమావతి, కన్వీనర్ కె.రమావతి, అధ్యక్షురాలు ఈశ్వరీ భూషణం, ప్రధాన కార్యదర్శి డాక్టర్ టి.పార్థసారది లకు దన్యవాదాలు తెలుపుతున్నానన్నారు.


## నేడు వ్యవసాయ విశ్వవిద్యాలయానికి రానున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు

బుద్వేల్, జనవరి22(ప్రభాత ఉదయం):: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్, అధికారులతో కలసి ఈ నెల 23న ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించనున్నట్లు వర్శిటీ రిజిస్ట్రార్ డి. శివాజీ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఢిల్లీ లోని ఎస్టీ కమిషన్ కేంద్ర కార్యాలయం నుంచి వ్యవసాయ విశ్వవిద్యాలయానికి సమాచారం అందించార న్నారు. గురువారం ఉదయం వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చేరుకోనున్న ఎస్టీ కమిషన్ సభ్యులు ముందుగా ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులు, ఉద్యోగులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకుంటారన్నారు. గత 10 సంవత్సరాలలో విశ్వవిద్యాలయంలో చేపట్టిన ఉద్యోగ నియామకాలతో పాటు ప్రవేశాలలో ఎస్టీ రిజర్వేషన్లు అమలు ను వారు పరిశీలించనున్నారన్నారు. అనంతరం విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్యతో పాటు వర్శిటీ ఉన్నతాధికారులతో వారు సమావేశమౌతారన్నారు.

## వరకట్న ఎదరేవులకు గురి చేసే భార్య మరణానికి కారణమైన ఓ వ్యక్తికి ఎడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష రూ. 3వేల జరిమాన

బుద్వేల్, జనవరి22(ప్రభాత ఉదయం):వివాహమైన ఆరు నెలలకే భార్యను వరకట్న వేదింపులకు గురి చేసిన ఆమె భర్తకు ఏడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష రూ. 3 వేల జరిమాన విధిస్తు రంగారెడ్డి జిల్లా 11వ ఏడీజే కోర్టు న్యాయ మూర్తి వై.జయప్రసాద్ బుధవారం తీర్పు వెల్లడించారు. వివరాలను అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ టి.వెంకట్రామిరెడ్డి వివరించారు. పం జాగుట్ట ప్రతాప్ నగర్ కు చెందిన మహ్మద్ అసద్ అలీ(33):కు 2018 జనవరి మాసం లో ఓల్డ్ మలక్ పేట్ ట్ కు చెందిన అలీ హసన్ ఆబాదీ కుమార్తె నేహ ఫాతిమా తో వివాహం జరిగింది. మహ్మద్ ఆసద్ అలీ. నేహ పాతిమా లు అత్తాపూర్ ఖయ్యుంనగర్ లో నివాసం ఉండేవారు. వివాహం అయిన ఆరు నెలలకే మహ్మద్ అసద్ అలీ భార్యను వరకట్నం కోసం వేదించడం మెదలు పెట్టాడు. దీంతో ఆమె 2018 జూన్ 9వ తేదీన అత్మహత్య చేసుకుంది. తన కూతురు మరణానికి అల్లుడు మహ్మద్ ఆనద్ ఆలీ కారణమని నేహ పాతిమా తండ్రి అలీ హసన్ అబేది అప్పటి రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశాడు. ఆ కేసును విచారణ చేసిన న్యాయస్తానం మహ్మద్ అసద్ అలీ కి ఏడు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 3వేల జరిమాన విదిస్సు తీర్పు చెప్పిందని ఇన్స్ పెక్టర్ టి.వెంకట్రామిరెడ్డి తెలిపారు.

## నేడు కిస్మత్‌పూర్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం



బండ్లగూడ, జనవరి 22(ప్రభాత ఉదయం): కిస్మత్పూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని డాన్ బోస్కో విద్యుత్ ఫీడర్ పరిధిలో గురువారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1:00 వరకు వివిధ మరమ్మత్రా నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని శిక్షణ అసిస్టెంట్ ఇంజనీర్ మల్లేష్ రాజ్ తెలిపారు ఈ విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన మిచల్ కాలనీ, వినాయక్ నగర్, డిడి కాలనీ, కాళీ మందిర్, ఎన్ఎఫ్సీ కాలనీ, ఆదర్శనగర్, ఎక్సైజ్ అకాడమీ, అభ్యుదయ నగర్, అరుణోదయ నగర్, సంధ్యా నగర్, జి ఆర్ నగర్, మాచన్నపల్లి ఎంక్లేవ్, తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

# ప్రజా ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట





ఆశ వర్కర్ల నుండి వినతి పత్రం స్వీకరిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహా

### రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా 35 కోట్లతో వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి

### ప్రస్తుత పీహెచ్సీలను కమ్యూనిటీ హెల్త్ సెంటర్ గా మార్చాలి: ఎమ్మెల్యే జిఎంఆర్

దేవరకద్ర, జనవరి 22 (ప్రభాత ఉదయం): ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వ ఆసుపత్రులలో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించి సంపూర్ణ ఆరోగ్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళుతుందని తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా అన్నారు. బుధవారం దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి ఎమ్మెల్యే జిఎంఆర్ తో కలిసి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనరసింహ మాట్లాడుతూ... 35 కోట్లతో వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసుకున్నాం, సంవత్సరంలో నిర్మాణం పూర్తి చేసి, హాస్పిటల్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని, యాక్సిడెంట్‌లలో గాయపడిన వ్యక్తుల ప్రాణాలు కాపాడేందుకు ప్రతి 30 కిలో మీటర్లకు ఓ ట్రామాకేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయబోతున్నమని తెలిపారు. దేవరకద్రలోనూ ఓ ట్రామా కేర్ సెంటర్ తో పాటు ప్రతి 30 కిలోమీటర్లకు ఒక డయాలసిస్ సెంటర్ ను ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో దేవరకద్ర, చిన్నచింతకుంటలో డయాలసిస్ సెంటర్ లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మహబూబ్‌నగర్ జనరల్ హాస్పిటల్‌లో కార్డియాలజి, నెఫ్రాలజీ వంటి అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలతో పాటు ఉగాది నాటికి ఎంఆర్ఐ సేవలను అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. అనంతరం ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ... దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణ భూమి పూజ కార్యక్రమానికి విచ్చేసిన మంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు. జానంపేట వద్ద ట్రామా సెంటర్ ను, సీసీ కుంట, పేరూరు ప్రైమరీ హెల్త్ సెంటర్లను కమ్యూనిటీ హెల్త్ సెంటర్ గా మార్చాలని, కౌకుంట్ల మండల మండల కేంద్రంలో హాస్పిటల్ ను, అంబులెన్స్ ను మంజూరు చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహను కోరారు.

# విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న టైం స్కేలు, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

### సిఐటియు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జే వెంకటేష్



ఉపకులపతి జానయ్యకు పూల మొక్కను అందజేస్తున్న సిఐటియు నాయకులు

రాజేంద్రనగర్, జనవరి 22(ప్రభాత ఉదయం): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య జానయ్య కు విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న టైం స్కేలు, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిఐటియు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తెలంగాణ యూనివర్సిటీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు జె వెంకటేష్ , కార్మికులు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎం పద్మశ్రీ లు మాట్లాడుతూ ... తెలంగాణ రాష్ట్రంలో ఉన్న వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్నటువంటి టైం స్కేలు కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పైన వైస్ ఛాన్సర్ ఏ జానయ్య వివరంగా తెలుపుతూ తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్నటువంటి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి గ్రాడివిటీ పెంచాలి, కార్మికులందరికీ 10 లక్షల రూపాయల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి. సర్వీస్ లో ఉన్న టైం స్కేల్ ఉద్యోగికి ఏ రకమైన చేతనైన మరణించినట్లయితే వారి కుటుంబ వారసులకి ఉద్యోగాలు ఇవ్వాలి అదే మాదిరిగా కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ టైం స్కేల్ ఉద్యోగులకు అందరికీ వర్తింప చేయాలి వార్షిక ఇంక్రిమెంట్ ఇవ్వాలి శాశ్వత ఉద్యోగుల మాదిరిగా మిగతా ఉద్యోగులందరికీ సెలవులు ఇవ్వాలి మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు సక్రమంగా అమలు చేయడం లేదు వాటిని అమలు చేయాలి 2 వ పిఆర్సి లో పర్మనెంట్ ఉద్యోగుల బేసిక్ పేని వీరికి కన్సల్టేషన్ ఫ్రీ గా నిర్ణయించాలి పర్మనెంట్ ఉద్యోగులకు అమలైన తేదీ నుండి టైం స్కేలు కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు కూడా అమలు చేయాలి టైం స్కేల్ ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి సీనియార్టీ ప్రకారం విద్యారత అనుభవాన్ని బట్టి పరిగణలోకి తీసుకొని ఔట్సోర్సింగ్ ఉద్యోగులను కూడా దశలవారీగా టైమ్ స్కేల్ పరిధిలోకి తీసుకురావాలి కాంటాక్ట్ కార్మికులందరికీ రెగ్యులేషన్ చేయాలి యూనివర్సిటీలో ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పనిచేస్తున్నారు సుమారు 20 సంవత్సరాలుగా పనిచేస్తున్నారు వీరికి అనేక సమస్యలు ఎదుర్కొంటూ గత ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోలేదు. ఇప్పుడు ఉన్నటువంటి తెలంగాణ రాష్ట్ర కే కాకుండా దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా పేరు ఉండే విధంగా కార్మికుల సమస్యలు పరిష్కరించవలసిందిగా ఆయనను కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు జాజాల రుద్ర కుమార్, తెలంగాణ యూనివర్సిటీ సేమ్ ప్లేస్ వర్కర్స్ యూనియన్ నాయకులు మహమ్మద్ ,మెట్టు రవి, అమీర్ మహేందర్ ,నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## స్వర్గీయ ఇంద్రారెడ్డి కాళ్ళు మొక్కిన నాయకులు నేడు ఆయన కుటుంబాన్ని విమర్శిస్తున్నారు

### మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్

### మైలార్ దేవుపల్లి డివిజన్లో నే ఉండే నాయకులు అభివృద్ధి చేయలేదు నియోజకవర్గ అభివృద్ధి చేస్తారా!



రాజేంద్రనగర్, జనవరి 22(ప్రభాత ఉదయం): స్వర్గీయ మాజీ హెూం శాఖ మంత్రి పి ఇంద్రారెడ్డి కాళ్ళు మొక్కిన నాయకులు నేడు ఆయన కుటుంబాన్ని విమర్శించి పబ్బం గడుపుకుంటున్నారని రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బాబుల్ రెడ్డి నగర్ కు చెందిన మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్ విమర్శించారు. సబిత ఇంద్రారెడ్డి అడుగుజాడలో నడుస్తున్న బిఆర్ఎస్ పార్టీ తరఫున కాంగ్రెస్ పార్టీని చీల్చి చెండాడుతున్న యువ నాయకులు పి కార్తీక్ రెడ్డి భవిష్యత్తులో మహా నాయకుడు ఇంద్రా రెడ్డి ఆశయాలను పటిష్టంగా నెరవేర్చి తండ్రిని మించిన తన యుడు అనిపించుకునే భవిష్యత్తులో మంచి నాయకుడు కావడం తత్యమన్నారు. తెలంగాణ ఉద్యమ నేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ ఆదేశాలతో బిర్ ఎస్ పార్టీ తరఫున పోరాడే పటిమ రాజేంద్రనగర్ నియోజకవర్గం ప్రజలకు పి కార్తీక్ రెడ్డి రూపంలో ఒక వరం ఆయుధం లభించింది ఎప్పుడు ఎలక్షన్ వచ్చినా యువ నాయకుడు పి కార్తీక్ రెడ్డిని రాజేంద్రనగర్ ఎమ్మెల్యేగా గెలిపించుకోవడానికి ప్రజలు తహతహలాడుతున్నారన్నారు. మైలార్దేవపల్లి డివిజన్ లో మహా నాయకులు ఉండి కూడా కొన్ని కాలనీలు కొన్ని బస్తీలు అభివృద్ధికి నోచుకోని పరిస్థితి మేము నియోజకవర్గ అభివృద్ధి కొరకే పార్టీ లు మారుతున్నాము నాయకులు పార్టీలు మారిన నియోజకవర్గం అభివృద్ధి దేవుడెరుగు కానీ ప్రస్తుత మై లార్ దేవ్ పల్లి డివిజన్ లోనే నివసిస్తూ ఉన్న నాయకులు మరి మై లార్ దేవ్ పల్లి డివిజన్ గురించి ఆలోచించడం లేదని తీవ్రంగా విమర్శించారు. రాబోయే రోజులలో ప్రజలే వీరికి తగిన బుద్ధి చెప్తారన్నారు. ప్రజల దగ్గరికి వెళ్లి ఆరు గ్యారెంటీలు 420 హామీల గురించి ప్రజలకు వివరంగా తెలిపి మైలార్దేపల్లి డివిజన్లో పలు బస్తీలు అభివృద్ధికి నోచుకోని పరిస్థితిలో ఉన్న యో ఆ బస్తీలో టిఆర్ఎస్ పార్టీ తరఫునుంచి మౌలిక సదుపాయాల గురించి కాంగ్రెస్ పార్టీని ఎండగడతామని మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్ అన్నారు.

## నకిలీ పత్రాలు సృష్టించి విలువైన భూమిని కబ్జా చేయాలని ప్రయత్నించిన ఇద్దరు వ్యాపారుల అరెస్ట్

బుద్వేల్, జనవరి22(ప్రణాత ఉదయం)::నకిలీ పత్రాలు సృష్టించి ఇతరుల విలువైన స్థలాన్ని కబ్జా చేయడానికి కోర్టులో కేసు వేసిన బుద్వేల్ రైల్వే స్టేషన్ లోని ఏకేఆర్ పెట్రోల్ పంప్, గగన్ పహడ్ లోని ఏకేఆర్ బార్ యజమానులైన ఇ.అశోక్ కుమార్(58):, ఇ. కిషోర్ కుమార్ (56): లను మైలార్దేవుపల్లి పోలీసులు అరెస్ట్ చేసి బుధవారం రిమాండ్ కు తరలించారు. ఇన్స్ పెక్టర్ నరేందర్ తెలిపిన వివరాలు ఈ విదంగా ఉన్నాయి... బేగంబజార్ కు చెందిన వ్యాపారి ఓం ప్రకాశ్ గంటాజీ అనే వ్యక్తి 2024 సెప్టెంబరు 23వ తేదీన మైలార్ దేవుపల్లి పోలీసులకు అశోక్ కుమార్, కిషోర్ కుమార్ లపై ఫిర్యాదు చేశారన్నారు. ఫిర్యాదులో బుద్వేల్ రైల్వే స్టేషన్ పరిధిలోని సర్వే నెంబర్ 265లో గల ప్లాట్ సెంబర్ 188/పార్ట్ లో గల 235 గజాల ఓపెన్ ప్లాటు, ప్లాట్ నెంబర్ 168/పార్ లో గల 102 గజాల ప్లాట్లను తనకు తెలియకుండానే తన సంతకు ఫోర్జరీ చేసి ఒక ఫేక్ అగ్రిమెంట్ ఆఫ్ సేల్ , పోజిషన్ తో ఒక ఫేక్ డాక్యుమెంట్ తయారు చేశారన్నారు. ఈ డాక్యుమెంట్ ను గగన్ పహాడ్ కు చెందిన ఏకేఆర్ పెట్రోల్ పం పు. ఏకేఆర్ బార్ ల యజమానులు ఆశోక్ కుమార్, కిషోర్ కుమార్: చేశారని తెలిపావన్నారు. నకిలీ పత్రాలతో రాజేంద్రనగర్ కోర్టులో తప్పుడు కేసు వేశారన్నారు. ఓం ప్రకాష్ గంటాజీ ఇచ్చిన పిర్యాదును పరిశీలించి విచారణ చేయగా అశోక్ కుమార్, కిషోర్ కుమార్ ల వద్ద ఉన్న స్థల పత్రాలు నకిలీవని తేలిందన్నారు. దీంతో వారిరువురిని అరెస్ట్ చేసి సెక్షన్లు 760, 420, 467, 471ఆర్ డబ్ల్యు 34 లను నమోదు చేయడం జరిగిందన్నారు. బుధవాంరం వారిరువురిని రిమాం డ్ కు తరలించగా కోర్టు వారికి 14రోజుల రిమాండ్ విధించిందని ఇన్స్పెక్టర్ నరేందర్ తెలిపారు.

ప్రభాత ఉదయం



## ఆందోళన అవసరం లేదు
# అందరికీ లబ్ధి చేకూరుతుంది

**సిడీసీ చైర్మెన్ గోల్లబాబు**

**ప్రజాపాలన గ్రామసభల్లో కాంగ్రెస్ నాయకులు**

కొత్తకోట, జనవరి 22(ప్రభాత ఉదయం):: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకాలు ప్రతి ఒక్కరికి అందుతాయని ఎవరు కూడా ఆందోళన చెందకూడదని నిరంతరాయంగా జరిగే ఈ ప్రక్రియ ద్వారా ప్రజలందరికీ లబ్ధి చేకూరుతుందని సిడీసీ చైర్మెన్ గోల్లబాబు, కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన గ్రామసభల సందర్భంగా కొత్తకోట మండల కాంగ్రెస్ నాయకులు వేముల శ్రీనివాస్ రెడ్డి, ఎన్ జె బోయెజ్ , పి కృష్ణారెడ్డి లు కొత్తకోట పట్టణ మున్సిపాలిటీ కేంద్రంలో మధ్యాహ్నం రెండు గంటలకు దండుగడ్డ కాలనీలో ఆరో వార్డులో నిర్వహించిన గ్రామసభల్లో ప్రజా పాలన అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి గ్రామసభల్లో పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ...జనవరి 26వ తేదీ నుంచి అమలయ్యే రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్ల పథకాలకు అర్హత గల లబ్ధిదారుల ఎంపిక నిమిత్తం చేపట్టిన ఈ గ్రామసభలలో అర్హత గల వారిని గుర్తించాలని, ఎవరైనా దరఖాస్తు చేసుకోని వారు ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చని కాంగ్రెస్ నాయకులు సూచించారు.గ్రామాలలో నిర్వహించే సమావేశాల్లో పాల్గొని అర్హత గల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలు భాగస్వాములు కావాలని నాయకులు సూచించారు.ఈ కార్యక్రమంలో, పట్టణ అధ్యక్షుడు మేస్త్రి శ్రీనివాసులు, మండల కాంగ్రెస్ కార్యదర్శి ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, ఏసీబి రాములు, జె సుభాష్, కదిరే సాయిల్ యాదవ్, దేశ్ పెంటన్న యాదవ్, సంద వెంకటేష్, కృష్ణారెడ్డి, కృపన్న, ముజీబ్, భాస్కర్, సాయిరాం యాదవ్, ఆయా వార్డుల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టిక ఆహారాన్ని అందించాలి

**జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారిని ప్రియాంక**

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి22(ప్రభాత ఉదయం):ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టిక ఆహారాన్ని అందించాలని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారిని ప్రియాంక అన్నారు. బుధవారం కేటిదొడ్డి మండలం, ఇర్కిచెడు గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న విద్య, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించడం జరిగింది. పాఠశాలలో చదువుకుంటున్న 9,10వ తరగతి విద్యార్థులకు మోటివేషనల్ క్లాసులు, ప్రత్యేక కార్యాచరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో మాట్లాడుతూ 10వ తరగతిలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలంటే కచ్చితంగా పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరు కావాలన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను మనసుపెట్టి ఎప్పటికప్పుడు నేర్చుకుంటే ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంతంగా విద్యను అభ్యసించవచ్చన్నారు. వచ్చే మూడు నెలలు విద్యార్థులకు చాలా విలువైనవని, పాఠశాలలో నిర్వహించే టెస్టులలో ప్రతిభ చాటితే వార్షిక పరీక్షలలో సులువుగా విజయం సాధించ వచ్చని ఆమె తెలిపారు. విద్యతోపాటు, విద్యార్థులు మంచి లక్షణాలను అలవర్చుకొని భవిష్యత్తును తీర్చిదిద్దుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పదవ తరగతి తర్వాత తమ భవిష్యత్తు ప్రణాళికలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఆమె సహపంక్తి భోజనం చేశారు. అంతకుముందు పాఠశాలలో పారిశుద్ధ్యాన్ని, పరిసరాలను, వంటగది, మరుగుదొడ్లను పరిశీలించి పరిశుభ్రతను పాటించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిపిఓ నర్సింహులు, ప్రధానోపాధ్యాయులు ఎలిషా, కౌన్సిలర్ సురేష్, చైల్డ్ హెల్ప్ లైన్ జయన్న, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## రాజ్యాంగ దినోత్సవాన్ని
# ఘనంగా నిర్వహించాలి

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి22(ప్రభాత ఉదయం):భారతదేశం 75 సంవత్సరాల గణతంత్ర దినోత్సవాన్ని పూర్తి చేసుకుంటున్న సందర్భంగా బీజేపీ పిలుపు మేరకు ప్రతీ బూత్‌లో రాజ్యాంగ గౌరవ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలని కేటిదొడ్డి మండల బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ నెల 22, 23 తేదీల్లో ఎస్సీ, ఎస్టీ ప్రజలతో సమావేశం, 24, 25 తేదీల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో రాజ్యాంగంపై బీజేపీ నిబద్ధతను యువతలో ప్రచారం చేయాలని బీజేపీ అదిష్టానం పిలుపు నిచ్చిన నేపథ్యంలో బుధవారం కేటిదొడ్డి మండలం పాగుంటా గ్రామంలో సంవిధాన్ గౌరవ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 26వ తేదీన గణతంత్ర దినోత్సవాన్ని ప్రతీ బూత్‌లో ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం 26 నవంబర్ 2015 న తొలిసారి రాజ్యాంగ దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా నిర్వహించిందన్నారు. అప్పటి నుండి ప్రతి సంవత్సరం రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకుంటూ మనం రాజ్యాంగాన్ని గౌరవించుకుంటున్నామన్నారు. దేశంలోని ప్రతి పౌరుడికి రాజ్యాంగం అత్యంత పవిత్రమైందన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు శ్రీపాదరెడ్డి, పటేల్ దేవేందర్ రెడ్డి, వెంకటాపురం గోవిందు పాగుంట బూత్ అధ్యక్షులు కృష్ణకాంత్, సి.వీరెష్ ,వీరష్ ఎంఅర్పీ అధ్యక్షులు ఆంజనేయులు, రాజు,స్వామి,వెంకటప్ప, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ, వార్డు సభలను సద్వినియోగం చేసుకోవాలి

## గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి



వార్డు సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న కలెక్టర్ సంతోష్



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి



వార్డు సభలో పాల్గొన్న ప్రజలు

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి22(ప్రభాత ఉదయం):ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి పొందేందుకు అర్హులైన ప్రతి ఒక్కరు గ్రామ,వార్డు సభలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ తెలిపారు. బుధవారం గద్వాల మున్సిపాలిటీ లోని 27వవార్డులో నిర్వహించిన ప్రజాపాలన వార్డు సభలో జిల్లా కలెక్టర్, గద్వాలశాసన సభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఈ నెల 26 నుండి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల అమలు చేయనుందని తెలిపారు. ఈ సందర్భంగా ఈనెల 21 నుండి జిల్లా వ్యాప్తంగా 84 గ్రామ సభలు నిర్వహించబడ్డాయని, ప్రస్తుతం వార్డు సభలు కూడా కొనసాగుతున్నాయని తెలిపారు. 27, 36, 24 వార్డులను కలిపి ఒకటిగా వార్డు సభ నిర్వహించబడిందన్నారు. ప్రజలు ఈ సభలను ఉపయోగించుకుని తమ అర్హతను నిర్ధారించి, పథకాల లబ్ధి పొందాలని కలెక్టర్ సూచించారు. పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతుకు ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద ఎకరానికి రూ.12,000 చొప్పున పెట్టుబడి సాయం అందిస్తుందని అన్నారు. సాగు భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా క్రింద ఒక్కో విడత రూ.6 వేల చొప్పున రెండు విడుదలకు రూ.12 వేల అందించడం జరుగుతుందన్నారు. 2018 నుండి కొత్త రేషన్ కార్డులు జారీ చేయడం, అలాగే కుటుంబ సభ్యుల పేర్లను చేర్చడం లేదా తొలగించడం జరగలేదని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డులను జారీ చేయడాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొన్నారు. అర్హుల నిర్ధారణ కోసం సామాజిక-ఆర్థిక సర్వే, మీ సేవా దరఖాస్తులు, గ్రామ సభలు, వార్డు సభల ద్వారా అందిన దరఖాస్తులను స్వీకరించి, సమగ్రంగా పరిశీలన జరుపుతున్నామని తెలిపారు.ప్రతి అర్హుడికి రేషన్ కార్డులు అందించేందుకు పారదర్శకంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రభుత్వం అర్హులైన సభ్యులకు సర్వే ఆధారంగా ఎంపిక చేసిన లబ్ధిదారులకు 5 లక్షల రూపాయలను మంజూరు చేస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. అర్హులుగా గుర్తించబడిన వారి వివరాలను వార్డు,గ్రామ సభలో అందరి సమక్షంలో చదివి వినిపించడం జరుగుతుందని అన్నారు. సంక్షేమ పథకాల కోసం అర్హత కలిగిన వారు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని, ఇప్పటి వరకు దరఖాస్తు చేయని వారితో పాటు, లబ్ధిదారుల జాబితాలో పేర్లు లేని వారు కూడా తమ అర్జీలు సమర్పించవచ్చని తెలిపారు. ఈ విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలు, అనవసర ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని అన్నారు. వార్డు సభలలో దరఖాస్తులు అందజేయవచ్చని, వీలుపడని వారు ఎప్పుడైనా మున్సిపల్ కార్యాలయాలలోని ప్రజా పాలన సేవా కేంద్రాలకు వెళ్లి సంబంధిత పత్రాలను జాతచేస్తూ దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. వచ్చిన ప్రతి దరఖాస్తును తప్పనిసరిగా పరిశీలించి అర్హులందరికీ సంక్షేమ పథకాలను వర్తింపజేస్తామని అన్నారు. గద్వాల్ శాసన సభ్యులు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజల అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని చెప్పారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు గ్రామ, వార్డు సభలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని పేర్కొన్నారు. లబ్ధిదారుల పేర్లు లిస్ట్‌లో రాకపోతే ఎటువంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని, గ్రామ, వార్డు సభలో మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని,సంబంధిత సమస్యలను పరిష్కరించడానికి అధికారులు ఎప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చేందుకు తమ కృషి చేస్తామన్నారు. అదేవిధంగా గతంలో గత ప్రభుత్వ హయాంలో డబల్ బెడ్ రూమ్ లో డిప్పు ద్వారా ఎంపికైన లబ్ధిదారులకు ఫిబ్రవరి నెలలో వారికి కూడా ప్రభుత్వం ఇండ్లను కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాలలో అదనపు కలెక్టర్ నర్సింగ రావు,గద్వాల్ మున్సిపల్ కమిషనర్ దశరథ్,వార్డు కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన వారికే ప్రభుత్వ సంక్షేమ పథకాలు



కేబి దొడ్డి గ్రామంలో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి



గ్రామసభలో ప్రజలనుండి వినతి పత్రాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

**ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి**

**సంక్షేమ పథకాల అమలుపై అపోహలు వద్దు**

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి22(ప్రభాత ఉదయం):ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు మాత్రమే దక్కుతాయని, ఇందులో ఎలాంటి అపోహలకు తావులేదని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజా పాలన గ్రామసభలలో భాగంగా బుధవారం కేటిదొడ్డి మండల కేంద్రంతో పాటు ఉమిత్యాల తండాలోని పంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన గ్రామసభలో గద్వాల ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా గద్వాల ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇండ్లను నిజమైన అర్హులకే అందిస్తామన్నారు. గల్లీ గల్లీకి తిరిగి ఇల్లు లేని పేదలకు మాత్రమే ఇంటి నిర్మాణానికి నిధులు చెల్లిస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, రైతుభరోసా పథకాలలో పైరవీలకు అవకాశం లేదన్నారు. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు జారీ చేస్తారని ఇది నిరంతరం ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులను, ఎంపీడీఓలను సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు.

**రోడ్డు నిర్మాణాలకు భూమి పూజ**

కేటిదొడ్డి గ్రామంలో నూతన రోడ్డు నిర్మాణానికి గద్వాల ఎమ్మెల్యే భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. అదే విధంగా త్వరలోనే కె.టి దొడ్డి మండల కేంద్రం నుండి కుచ్చినెర్ల వరకు, కేటిదొడ్డి నుండి గువ్వలదిన్నె వరకు త్వరలో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్( స్థానిక సంస్థల): నర్సింగరావు, గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ కురువ హనుమంతు, ఎంపీడీవో కృష్ణమోహన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, మాజీ జెడ్పిటిసి రాజశేఖర్ , మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ నాయుడు, సింగిల్ విండో డైరెక్టర్ రఘు కుమార్ శెట్టి, వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఆంజనేయులు, మాజీ సర్పంచ్లు ఆంజనేయులు, సత్యనారాయణ , నాయకులు చక్రధర్ రావు, ఉరుకుందు, శేఖర్ రెడ్డి, వెంకటన్న గౌడ్, చంద్రశేఖర్, రాజేష్, తిమ్మారెడ్డి, శేఖర్ రెడ్డి, గోపి , పవన్ రెడ్డి, టీచర్ గోవిందు, నాసిర్, వెంకటేష్, వీరేష్, నాయకులు కార్యకర్తలు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్మూర్ పసుపుకి భౌగోళిక గుర్తింపుకై
# అధ్యయన బృందం పర్యటన



నిజామాబాద్ జిల్లాలో పసుపు పంట పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు



రైతు క్షేత్రాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జనవరి 22(ప్రభాత ఉదయం): నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ ప్రాంతంలో స్థానికంగా పండే పలు విశిష్టతలు కలిగిన ఆర్మూరు పసుపు భౌగోళిక గుర్తింపు పై శాస్త్రవేత్తల బృందం క్షేత్రస్థాయి పరిశీలన చేసింది. నాబార్డు వారి సౌజన్యంతో శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ప్రాజెక్టు ప్రధాన పరిశోధకులు, ఉద్యాన కళాశాల మోజర్ల అసోసియేట్ డీన్ డాక్టర్ పిడిగం సైదయ్య నేతృత్వంలో కమ్మరపల్లి పసుపు పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు బి. మహేందర్, పి.శ్రీనివాస్, నాబార్డ్ డి డి ఎం ప్రవీణ్ కుమార్ లతో కూడిన బృందం ఆర్మూర్ పసుపుకి భౌగోళిక గుర్తింపు కోసం అధ్యయనం విషయమై సమావేశమయ్యారు. భౌగోళిక గుర్తింపు ఆర్మూర్ దరఖాస్తు చేయడానికి కావలసిన సమాచారం, వాతావరణ పరిస్థితులు, భూమి లక్షణాలు, ఈ రకంలో ఉండే ప్రత్యేకమైన లక్షణాలు, ఆర్మూర్ పసుపు సాగు చరిత్ర, డాక్యుమెంటరీ ఎవిడెన్స్ మొదలైన విషయాల గురించి కూలంకషంగా చర్చించారు. ఆర్మూరు పసుపు పండించే ప్రాంతాలలో రైతు క్షేత్రాలను సందర్శించి సాగు చేస్తున్న పసుపు రకాల విశిష్టతను పరిశీలించడం జరిగింది. పసుపుకి భౌగోళిక గుర్తింపు వచ్చినట్లయితే ఎగుమతులు పెరగటంతో పాటు, దేశవ్యాప్తంగా ఈ రకానికి మార్కెటింగ్ అవకాశాలు పెరుగుతాయని, అధిక ధరలు కూడా లభిస్తాయని ఈ ప్రాజెక్టు ప్రధాన పరిశోధకులు డాక్టర్ పిడిగం సైదయ్య అన్నారు. భౌగోళిక గుర్తింపుకై చెన్నై ప్రధాన కేంద్రంగా ఉన్న మేధో సంపత్తి హక్కుల కేంద్రం కేంద్రానికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. మూడు నుండి నాలుగు నెలల్లో అప్లికేషన్ ని సమర్పించనున్నట్లు బృందం తెలిపింది. త్వరలోనే ఈ రకానికి సంబంధించిన డిఎన్ఏ ప్రొఫైలింగ్, లక్షణాల వివరణ, ప్రయోగశాలలో వాటి నమూనాల పరిశీలించి అధ్యయనం చేయనున్నట్లు పిడిగం సైదయ్య తెలిపారు.




దరఖాస్తులను స్వీకరిస్తున్న కౌన్సిలర్ చలివేందిరి స్రవంతి శ్రీకాంత్ రెడ్డి

# అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు

**కౌన్సిలర్ చలివేందిరి స్రవంతి శ్రీకాంత్ రెడ్డి**

**మధురానగర్ లో వార్డు సభకు విశేష స్పందన**

శంషాబాద్, జనవరి 22 (ప్రభాత ఉదయం): అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని శంషాబాద్ మున్సిపాలిటీ 23వ వార్డు కౌన్సిలర్ చలివేందిరి స్రవంతి శ్రీకాంత్ రెడ్డి అన్నారు . బుధవారం శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 23 వ వార్డ్ మధురనగర్ లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన,"ప్రజా పాలన వార్డ్ సభ "కార్యక్రమం విజయవంతం అయింది. వార్డు సభ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమం లో మున్సిపాలిటీ చైర్మన్ సుష్మ మహేందర్ రెడ్డి, కౌన్సిలర్ చలివేందిరి స్రవంతి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడతూ... రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు తప్పకుండా ఈ యొక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజాలందరిని కోరారు. దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులందరికి న్యాయం జరిగేలా చూస్తానని అన్నారు. ఈ కార్యక్రమం లో కమిషనర్ సుమన్ రావు, కో ఆప్షన్ సభ్యులు కవిత ప్రసాద్, ఈదుల నరసింహ గౌడ్. పవన్ గౌడ్, ,జెల్లపల్లి శ్రీనివాస్,శ్రీశైలం, అశోక్ గౌడ్, రామావత్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ సీఎం కప్ వాలీబాల్ టోర్నమెంట్ 24న ప్రారంభం

**కల్చరల్ వెల్ఫేర్, స్పోర్ట్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి**

కూకట్‌పల్లి,జనవరి 22 (ప్రభాత ఉదయం): కూకట్ పల్లి నియోజకవర్గంలో కల్చరల్ వెల్ఫేర్, స్పోర్ట్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 24 న ప్రారంభమై 26వ డేట్ ముగుస్తాయి. రమ్య గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన తెలంగాణ సీఎం వాలీబాల్ టోర్నమెంట్ ఏర్పాటు చేసిన సందర్భంగా కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ గ్రౌండ్ పర్యవేక్షణలో భాగంగా వాలీబాల్ ఆడుతూ నాయకులు, కార్యకర్తలు క్రీడాకారులతో కాసేపు సరదాగా గడిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సాదు ప్రతాపరెడ్డి, విట్టల్ రెడ్డి, రఘు, డివిజన్ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, అధ్యక్షురాలు సంధ్యారాణి, పొన్నం రజిత, ఏఎంసీ వైస్ చైర్మన్, రేష్మ, మేకల మైఖేల్, మస్తాన్ రెడ్డి, సునీల్ యాదవ్, కొండల్ రెడ్డి, శివ చౌదరి, ముస్తఫా, నయన్ బాయ్, అల్లావుద్దీన్, అశోక్, శ్రీధర్ చారి, రాజు ముదిరాజ్, బాబురావు, రామకృష్ణారెడ్డి, గిరి నాయుడు, నాయకులు, నాయకురాలు, క్రీడాకారులు, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

Printed and Published MEKALA DAMODAR REDDY on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231. Cell:9391089608